క్లుప్తంగా

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎస్.భరత్‌నాయక్

పత్తికొండ(తుగ్గలి): రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో జాప్యం వద్దని ఆర్డీఓ డాక్టర్ ఎస్.భరత్‌నాయక్ ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజన్‌లోని తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ..ప్రతి సమాచారాన్ని వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా తెలియజేయాలన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో డైరెక్టర్‌గా, లేదా ఫోన్ ద్వారా చెప్పాలని సూచించారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి హాజరు కావాలని, రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్లకు చెక్

మద్దికెర : రబీ సీజన్‌లో సాగు చేసే పప్పుశనగ విత్తనాలను తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని, దీంతో పైరుకు 25–30 రోజుల వరకు తెగుళ్ల దరిచేరవని ఏఓ రవి అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు విత్తనశుద్ధిపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారులు సూచించిన మందులతో విత్తనశుద్ధి చేయడం వల్ల పంటలను తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చని, అలాగే అధిక దిగుబడి సాధించేందుకు వీలవుతుందన్నారు. అనవసరంగా రసాయనిక మందులు పిచికారీ చేయరాదని చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌ను సన్మానిస్తున్న కార్యలయ సిబ్బంది, వీఆర్ఓలు

హొళగుంద: తహసీల్దారుగా కోడుమూరి సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న ప్రసాద్‌రాజు పత్తికొండ ఆర్డీఓ కార్యాలయానికి ఏఓగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో పత్తికొండ ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సతీష్‌ను ఇక్కడికి పంపారు.విధుల్లో చేరిన ఆయనకు కార్యాలయపు సిబ్బంది, వీఆర్ఓలు నాగరాజు, దామోదర, మల్లేష్, మాజీ సర్పంచ్ రాజ పంపన్నగౌడ్ సన్మానించి అభినందనలు తెలిపారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను సోమవారం హొళగుంద నూతన తహసీల్దార్ సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

మంత్రాలయానికి కర్ణాటక భక్తుల పాదయాత్ర



భక్తులకు అన్నదానం చేస్తున్న స్థానికులు

హొళగుంద: మండల కేంద్రం మీదుగా సోమవారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు మంత్రాలయానికి పాదయాత్రగా బయలుదేరారు. వారికి హొళగుందలో స్థానిక భక్తులు అన్నదానం చేశారు. బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా కరూరు గ్రామానికి చెందిన దాదాపు 200 మంది భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. కరూరు నుంచి తెల్లవారుజామున కాలినడక ప్రారంభించామని రెండు రోజుల్లో మంత్రాలయం చేరుకుంటామని భక్తులు నారాయణ రెడ్డి, లోకారెడ్డి, సురేష్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వాసుదేవారెడ్డి, దేవిరెడ్డి తదితరులు తెలిపారు. గత 29 ఏళ్లుగా దీపావళి పండుగకు ముందు మంత్రాలయానికి కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించుకుంటున్నామని చెప్పారు.

నేడు స్మార్ట్..రేపు ప్రీపెయిడ్

- ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ఆ తరువాత మిగిలిన సర్వీసులకూ..
- సెల్‌ఫోన్ లాగే విద్యుత్‌లోనూ ముందస్తు రీచార్జ్
- రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగులు
- ఉపాధి కోల్పోనున్న మీటర్ రీడర్ల
- ఆలూరు సబ్ డివిజన్‌లో 76,178 కనెక్షన్లు



ఆలూరులోని ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

ఆలూరు రూరల్: ఇప్పటి వరకు విద్యుత్ వినియోగించిన అనంతరం యూనిట్ల ఆధారంగా విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాం. అయితే త్వరలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనుండటంతో ముందస్తుగా రీచార్జ్ చేసుకొని ఆ మేరకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం సెల్‌ఫోన్‌కు ప్రీపెయిడ్ పద్ధతిలో ఎలా రీచార్జ్ చేసుకొని వాడుతున్నామో అదే పద్ధతిలో మనం ముందస్తుగా చెల్లించి ఆ మొత్తం వరకు విద్యుత్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే మళ్లీ రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే చీకట్లో మగ్గాల్సిందే. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో మిగిలిన విద్యుత్ కనెక్షన్లకు ఏర్పాటు చేసే అవకాశముందని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

త్వరలో అన్ని రకాల కనెక్షన్లకు..

సాధారణంగా ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల్లో కట్టడానికి ఎలాగో సమయం ఉంటుంది. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉంటుంది. ఇప్పటి వరకు అనుసరిస్తున్న పద్ధతి ఇదే. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ మీటర్లు అమర్చింది. వచ్చే ఏడాది జనవరి నాటికి అన్ని సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చనున్నారు. నూతన విధానం ద్వారా ప్రీపెయిడ్ మీటర్లకు రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. అలా చేయక పోతే సరఫరా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటు పడిన వినియోగదారులుకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో 76,178 వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

భవిష్యత్ అంతా ప్రీపెయిడ్..

స్మార్ట్ మీటర్లను ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో బిగిస్తున్నారు. ప్రస్తుతానికి ఆ మీటర్లలో సిమ్ కార్డు అమర్చలేదు. దశలవారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు. తర్వాత సిమ్ కార్డు రీచార్జ్‌లాగా ఎంత కావాలో అంత మొత్తం ముందుగానే డబ్బులు కట్టి వేసుకోవాలి. అర్ధరాత్రి అయినా.. బ్యాలెన్స్ లేకపోతే సరఫరా ఆటోమెటిక్‌గా కట్ అయిపోతుంది.

ఉపాధి కోల్పోనున్న మీటర్ రీడర్లు

స్మార్ట్,ప్రీపెయిడ్ మీటర్లు అందుబాటులోకి వస్తుండడంతో దీని ప్రభావం విద్యుత్ మీటర్ రీడర్లపై పడనుంది. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లోని 5 మండలాల పరిధిలో మొత్తం 27 మంది మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతి నెల 1 నుంచి 5వ తేదీలోపు అన్ని మీటర్ల రీడింగ్‌లను రికార్డు చేసి డివిజన్‌లోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో రీడింగ్‌ను లోడ్ చేస్తున్నారు. వీరందరూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఒక మీటరు రీడింగ్ తీసేందుకు రూ.3 చొప్పున చెల్లిస్తున్నారు. స్మార్ట్ మీటర్ రాకతో వీరంతా ఉపాధి కోల్పోనుండటంతో వారిలో ఆందోళన నెలకొంది.

ఉపయోగాలు..

- గతంలో మాన్యువల్ మీటర్లు ఉండేవి. వాటిని చూసి రీడర్స్ రిడింగ్ రాసుకునేవారు. తర్వాత ఐడీ ఆర్ అంటే స్కాన్ చేస్తే రీడింగ్ ఆటోమెటిక్‌గా రికార్డ్ అవుతుంది. ఇప్పటి స్మార్ట్ మీటర్లు తర్వాత ప్రీపెయిడ్‌గా మారుతాయి.
- వీటిని ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ బ్యాలెన్స్ ఏ విధంగా చేసుకుంటామో..ఇక్కడ అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవాలి.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా అవుతుంది. నగదు అయిపోయిన వెంటనే సరఫరా బంద్ అవుతుంది. రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగులుంటాయి.
- బ్యాలెన్స్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి.

ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో విద్యుత్ కనెక్షన్ల వివరాలు..

గృహ వినియోగదారుల కనెక్షన్లు:	58,189
ప్రభుత్వ కార్యాలయాలు :	1,103
వాణిజ్య సముదాయ కనెక్షన్లు:	280
చిన్న పరిశ్రమల కనెక్షన్లు:	4,429
వ్యవసాయ బోరు కనెక్షన్లు :	12,177

నష్టాలు..

- విద్యుత్ మీటర్లను నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్‌లు పనిచేస్తున్నారు. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బేనని చెప్పవచ్చు.
- అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారులు ఏ మాత్రం అలసత్వం వహించినా సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ బకాయిలు రూ.13.94 కోట్లు

ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ శాఖలలు, వీధి దీపాలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం 1,103 వేల సర్వీసులు ఉన్నాయి. వీటి పరంగా ఇప్పటి వరకు రూ. 13.94 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. ఎక్కువగా పేరుకుపోయిన పంచాయతీ బకాయిల కోసం ఆర్థిక సంఘం నిధులు వచ్చినప్పుడు విన్నవించినా ఆశించిన స్థాయిలో ఫలితం లేదు. ప్రభుత్వ కార్యాలయాలే కదా కరెంట్ కట్ చేయరు అనే నమ్మకం ఏర్పడడంతో అవి మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. స్మార్ట్ మీటర్ల రాకతో ముందే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో బకాయిల బెడద తప్పనుంది.

ఉపాధి కోల్పోతాం



స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి వస్తే మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోతారు. ప్రస్తుతం మేమంతా కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నాం. జిల్లాలో 517 మంది మీటర్ రీడర్లు ఉన్నారు. సంస్థ మాకు ఒక రీడింగ్‌కు రూ.3 చొప్పున చెల్లిస్తోంది. ప్రభుత్వం, విద్యుత్ సంస్థ అధికారులు చొరవ చూపి ఇదే శాఖలో మాకు ఉపాధి కల్పించేలా కృషి చేయాలి.సబ్ స్టేషన్లలో వాచ్‌మెన్, అటెండర్ పోస్టుల్లో మీటర్ రీడర్లను భర్తీ చేయాలి.

– వేద వ్యాసముని, మీటర్ రీడర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు

దశల వారీగా అమలు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నాం. దశల వారీగా పరిశ్రమలు, గృహ సర్వీసులకూ అమలు చేయనున్నారు. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన సరఫరాను వినియోగదారులు పొందవచ్చు.

– గురప్ప, ఏఈ ఇన్‌చార్జ్,ఆలూరు

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

ఆలూరు రూరల్: సచివాలయ ఉద్యోగులు రోజూ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రభాకర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని నాలుగు సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుదూ..ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు మ ధ్యాహ్నం 2.30 గంటలకు, సాయంత్రం 5 గంటల కు మూడు సార్లు బయోమెట్రిక్ హాజరు వేయాల్సిందేనని స్పష్టం చేశారు. బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే జీతాలు చెల్లించనున్నట్లు చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు.

పాత మిద్దె ఇళ్లలో ఉండొద్దు

ఆస్పరి: ఈనెల 17వ తేదీ వరకు జిల్లాలో భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో పాత మిద్దె ఇళ్లల్లో ఉండొద్దని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. సోమవారం రెవె న్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశమున్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత ఇళ్లలో నివాసముండే వారు మూడు రోజులు సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలని చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు: తుపాన్ వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో రైతులు పొలాలనుంచి వ్యవసాయ పనులను ముగించుకుని త్వరగా ఇళ్లకు చేరుకునేలా వీఆర్వోలు, వీఆర్ఏలు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు ప్రమాదం ఉన్నందున బయలు ప్రదేశాల్లో ఉండేవారు చెట్లకు వెళ్లరాదన్నారు. పశువులు, మేకలు, గొర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ బసన్నగౌడు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి, వీఆర్వోలు ఉన్నారు.

లక్కీడిప్‌లో మద్యం షాపుల కేటాయింపు

ఆలూరు: నియోజకవర్గంలోని 12 మద్యం దుకాణాలకు 255 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం జరిగిన టెండర్ల ప్రక్రియలో పలువురు దుకాణాలను దక్కించున్నారు. ఆలూరు మండలం 2, ఆస్పరి మండలంలో 2, హాలహర్వి 2, చిప్పగిరి 1, హొళగుందలో 2, దేవనకొండ మండలంలో 3 షాపులను ప్రభుత్వం కేటాయించింది. ఆలూరు మండలంలో 1షాపును హొళగుంద గ్రామానికి చెందిన ఈడిగ వెంకటస్వామి దక్కించుకోవడంపై స్థానిక టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. అలాగే 2వ షాపును బొగ్గుల శివశంకర్, హొళగుందలో రెండు షాపులను ఏ.శ్రీనివాసులు, పాండురంగ, ఆస్పరిలో రాధ బిణిగేరి ,రెడ్డిగారి కరుణాకర్‌రెడ్డి, హాలహర్విలో నాయక ఆంజనేయులు, ఆగుంది శ్రీధర్, చిప్పగిరిలో బోయ సురేష్‌కుమార్, దేవనకొండ మండలంలో 3 షాపులను డి. పాండు, బోయ మల్లేష్, ఎరుకల కృష్ణమూర్తి టెండర్‌లో దక్కించుకున్నారు. షాపులు దక్కించుకున్న వారు నేతలకు మామూళ్లు ముట్టజెప్పాలని అప్పడే బేరసారాలు మొదలయ్యాయనే చర్చ సాగుతోంది.

ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా లియాఫీ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధలింగ, రఫిక్ తెలిపారు. సోమవారం భోజనం విరామమం సమయంలో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నాను చేపట్టారు. వారు మాట్లాడుతూ పాలసీదారుడు తీసుకునే పాలసీని మినమమ్ సమ్ అష్యూరుడ్ పెంచడం వలన సామన్య పేద మధ్య తరగతి వారికి పాలసీలను ఇవ్వడం సాధ్యం కాదన్నారు. దీంతో పాలసీల ప్రిమియం పెరగడంతో పాలసీదారులు కట్టుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఏజెంట్లకు రావాల్సిన రాయితీలను తగ్గించడం విచారకరమన్నారు. ఆలిండియా పిలుపు మేరకు ఈ నెల 21, 28వ తేదీలో కూడా ధర్నాలను నిర్వహిస్తామని, పాలసీదారులు సహకరించాలని కోరారు.

18 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి అండర్–14, అండర్–17 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 18వ తేదీ వాలీబాల్, ఆర్చరీ, నెట్‌బాల్, మోడ్రన్ పెంటాథ్లాన్, 22వ తేదీన ఖోఖో, సాఫ్ట్‌బాల్, పవర్ లిఫ్టింగ్, ఉషూ 25వ తేదీన హాకీ, క్రికెట్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

దేవనకొండ: ఈనెల 16వ తేదీ నుంచి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి పంట సాగుచేసిన రైతులు వర్షం ఎక్కువైతే పొలాల్లో నీరు నిలబడకుండా బయటికి పంపాలన్నారు. వీలైనంత వరకు ఇప్పుడు పైపాటి ఎరువులు వేసుకోరాదన్నారు. అవసరం అయితే వర్షం తగ్గిన తర్వాత వేసుకోవాలన్నారు. వేరుశనగ సాగుచేసిన రైతులు పంట కోతలు పూర్తయ్యి ఉంటే వేరుశనగకాయలు తడవకుండా టార్పాలిన్స్‌తో కప్పి ఉంచుకోవాలన్నారు. ఒకవేళ కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలని చెప్పారు. పత్తి రైతులు పత్తి తీతలు చివరి దశలో ఉన్నాయని, ఈ చివరి కోతను వాయిదా వేసుకోవాలన్నారు. కోత పూర్తయిన వారు పత్తి వర్షంలో తడవకుండా కాపాడుకోవాలన్నారు. వీలైనంత వరకు పప్పుశనగను వర్షాలు తగ్గిన తర్వాత విత్తుకుంటే మంచిదన్నారు. కంది పంట సాగుచేసిన రైతులు మొగ్గ నుంచి పూత దశలో ఉన్నందున పొలాల్లో నీరు నిలిస్తే నీటిని బయటకు పంపాలన్నారు. లేకపోతే వేరుకుళ్లు, ఎండుతెగులు ఆశించే అవకాశం ఉంటుందన్నారు.

ఘనంగా గంధం వేడుకలు



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో మహబూబ్ సుభాని ఉరుసులో భాగంగా సోమవారం రాత్రి గంధం వేడుకలు వైభవంగా జరిగాయి. దర్గా నుంచి రాత్రి 7 గంటలకు ప్రారంభం అయిన గంధం వేడుకలు రాత్రి 9గంటల వరకు గ్రామ పురవీధుల గుండా వైభవంగా జరిగాయి. మంగళవారం రోజు ఉరుసు ఉత్సవం ఉంటుందని నిర్వహకులు తెలిపారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు భూమి పూజ



పత్తికొండలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ(తుగ్గలి) : నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. 'పల్లె పండుగ' వారోత్సవాల్లో భాగంగా సోమవారం పత్తికొండ మండలంలోని పత్తికొండ, చక్రాల్ల, దూదేకొండలో రూ.69.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అలాగే చక్రాల్లలో రూ.5లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. నియోజకవర్గంలో సీసీ రోడ్లు డ్రైనేజీల నిర్మాణాలకు రూ.2 కోట్లు మంజూరైనట్లో ఎమ్మెల్యే చెప్పారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, సర్పంచ్ కొమ్ము దీపిక, ఎంపీటీసీ సభ్యుడు రాజు, పీఆర్ డీఈ శేషయ్య, ఏఈ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ నరసింహులు పాల్గొన్నారు.

తుగ్గలి మండలంలో..

మండలంలోని అమినాబాద్, జీ.ఎర్రగుడి, పగిడిరాయి గ్రామాల్లో అధికారులు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు సీసీరోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ విశ్వమోహన్‌రెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీహరి పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని ములుగుందం, బనవనూరు, డి.కోటకొండ గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ములుగుందంలో ఉపాధి హామీ పథకం కింద రూ. 15 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఎంపీడీఓ గీతావాణి ప్రారంభించారు. బనవనూరు, డి.కోటకొండ గ్రామాల్లో కూడా సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభమయ్యాయి.

మద్దికెర : గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎంపీడీఓ కొండయ్య, సర్పంచ్ శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని మదనంతపురం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి నిధులు రూ.4.50 లక్షలతో సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ఎంపీటీసీ దీపిక, ఏపీఓ నర్సిరెడ్డి ,ఈఓ పరమేష్ పాల్గొన్నారు.

పనుల కోసం తమ్ముళ్ల వాగ్వాదం

సీసీ రోడ్లు వేయడానికి అధికారులు భూమి పూజ అనంతరం రెండు వర్గాల తెలుగు తమ్ముళ్లు పనుల విషయమై వాగ్వాదం చేసుకున్నారు. నీవొక్కడేనా పనులు చేసుకునేది.. నువ్వేంత అంటే నువ్వేంత అంటూ ఇరువర్గాల నాయకులు వాగ్వాదానికి దిగడంతో అధికారులు వారికి నచ్చజెప్పి పంపారు.

చిప్పగిరి: మండలంలోని నగరడోణ,డేగులహాల్ గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. రూ.20 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ అల్లాబకాష్, ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, నరసింహులు, సర్పంచులు నీలకంఠ,మల్లమ్మ పాల్గొన్నారు.

హాలహర్వి: గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. సర్పంచులు ఉలిగప్ప,మోకా మల్లి, ఎంపీటీసీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు నిరంజన్‌కుమార్, మంజునాథ్ పాల్గొన్నారు.

కృష్ణగిరి : మండలంలోని అమకతాడు, పుట్లూరు, కర్లకుంటలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, వెల్దుర్తి మండలం అల్లుగుండు, బింగిదొడ్డి, బోగోలు గ్రామాల్లో ఎంపీడీఓ సుహాసినమ్మ ఆధ్వర్యంలో 'పల్లె పండుగ' వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ నిధులతో చేపట్టబోయే సీసీరోడ్ల పనులకు భూమి పూజ చేశారు. అమకతాడు సర్పంచ్ సర్వేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలూరు: పల్లె పండుగ వారోత్సవాల్లోభాగంగా గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి తెలిపారు. సోమవారం మండలంలోని అరికెర గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించనున్న గొర్రెల షెడ్ పనులకు సర్పంచ్ నాగరాజ్‌తో కలిసి భూమిపూజ చేశారు.

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు (అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న వాల్మీకి మహర్షి జయంతిని ఈనెల 17న ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ అన్నారు. వాల్మీకి జయంతిని విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక సంక్షేమ భవన్‌లోని తన చాంబర్‌లో వాల్మీకి నేతలతో ముందస్తు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు మీరు అందించే సలహాలు, సూచనలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామన్నారు. 17వ తేదీన ఉదయం మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జయంతి కార్యక్రమాలను కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు.

16న జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీ

దేవనకొండ: మండలంలోని ఐరన్‌బండ బి.సెంటర్ గ్రామంలో జగద్గురు దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా ఈనెల 16, 17వ తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు ఖాసీం, రఫీ, మైబు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గెలుపొందిన జట్లకు వరుసగా రూ.15,016, రూ. 10,016, రూ.5,016 చొప్పున అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు ఎంట్రీఫీజు రూ.500 చెల్లించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 8688070442, 9908332330 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

తుగ్గలి : ఎద్దులదొడ్డి మాజీ సర్పంచ్ వైవి భాస్కరరెడ్డి(70) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక సోమవారం ఇంట్లోనే మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల హర్షవర్ధనరెడ్డి, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఎస్. రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామానికి చేరుకుని భాస్కరరెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

లైసెన్స్, బీమా లేకుండా ఆటోలు నడపరాదు

హాలహర్వి: లైసెన్స్, ఇన్సూరెన్స్ లేకుండా ఆటోలు నడపరాదని ఎస్ఐ చంద్ర సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతోనే ఇటీవల ఆటోల ప్రమాదాలు పెరిగాయని చెప్పారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుధ్యం..పట్టించుకునే వారేరీ?

- డంపింగ్ యార్డులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- అపరిశుభ్రంగా వీధులు
- పందులకు ఆవాసంగా చెత్తకుప్పలు
- పట్టించుకోని యంత్రాంగం



ఆలూరు సచివాలయం-2 సమీపంలో చెత్తాచెదారంలో పందుల సంచారం



హౌసింగ్ కార్యాలయం ఎదురుగా నిలిచిన మురుగు నీరు



గుంతకల్లు చెక్ పోస్టు సమీపంలో డంపింగ్ యార్డు తలపిస్తున్న ఖాళీ స్థలం

ఆలూరు రూరల్: పట్టణంలోని పలు కాలనీల్లోని ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఓ పక్క అడపాదడపా కురుస్తున్న వర్షాలతో నీరు నిల్వ చేరి వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు భయాందోళనకు గురవుతుంటే..మరో పక్క అధ్వాన్న పారిశుద్ధ్యం మరిన్ని రోగాలకు కారణమవుతోంది. హైవే- 167 పక్కనే నిత్యం అధికారులు వెళ్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఆయా కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం? : పట్టణంలోని కోయనగర్ కాలనీ, ఎల్లార్తి రోడ్డు, గుంతకల్లు చెక్‌పోస్టులోని ఖాళీ ప్రాంతాలు చెత్తాచెదారం నిండి మురుగు కూపంలా మారాయి. పంచాయ తీలో సేకరించిన చెత్తా చెదా రం ఆయా ఖాళీ ప్రదేశాల్లో వేయడంతో వర్షపు నీరు చేరి కుళ్లిపోయి కంపు కొడుతున్నాయి. పందులు,కుక్కలకు ఆవాసా లుగా మారడంతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు చెత్తను తొలగించకపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండి వ్యాధులు ప్రబలేందుకు కారణబూతమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కేవలం రాజకీయ నాయకులు లేదా ఉన్నతాధికారులు వస్తున్నప్పుడు మాత్రమే హడావుడిగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు.కాలువల్లోని మురుగు తీయకపోవడంతో నీరు ముందుకు పారక దోమల బెడద పెరిగిపోయింది.ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.